క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

14న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 14న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

మిల్లెట్స్‌పై అవగాహన


కళాశాల దత్తత ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

దాబాగార్డెన్స్ : అంతర్జాతీయ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్ కార్యక్రమంలో భాగంగా విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు మంగళవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. కళాశాల దత్తత గ్రామాల కుటుంబాలను సందర్శించి చిరుధాన్యాలు–ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి కొత్త అనారోగ్యాలకు కారణం అవుతుందని, మన ప్రాచీనుల జీవనశైలిలో చిరుధాన్యాలు ఆరోగ్యాన్ని పెంపొందించడంలో ప్రధాన పాత్ర పోషించేవని, గతంలోకి తిరిగి వెళ్లాలని ఉద్బోధించారు. అనంతరం ఎన్‌సీసీ అసోసియేట్ ఆఫీసర్ డాక్టర్ కె. గీతాంజలి మాట్లాడుతూ చిరుధాన్యాలను ఆహారంలో చేర్చుకుని, ఆరోగ్యకర జీవనశైలిని పాటించాలని సూచించారు.

పంచముఖ హనుమాన్‌గా యోగసిద్ధాంజనేయుడు


ప్రత్యేక అలంకరణలో యోగసిద్ధాంజనేయుడు

మురళీనగర్: జాతీయ రహదారి సూర్యనగర్–2లో వెలసిన యోగ సిద్ధాంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాసం ఆఖరి మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఆరవిల్లి శ్రీకాంతాచార్యులు స్వామికి సింధూర అర్చన చేసి పంచముఖ ఆంజనేయస్వామిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక సుందరాకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పోలమాంబ ఆలయంలో చండీ హోమం

ఏయూక్యాంపస్: స్థానిక పోలమాంబ ఆలయంలో మంగళవారం చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు స్వయంగా హోమం నిర్వహించారు. శ్రీచక్రార్చన జరిపారు. ఆలయ ఈవో కె.గాయత్రి మాట్లాడుతూ దేవస్థానంలో ప్రతి నెలా పౌర్ణమి, అమావాస్య రోజుల్లో చండీ హోమాలు నిర్వహిస్తున్నామని, భక్తులు స్వయంగా పాల్గొనవచ్చని తెలిపారు.



ఇది కదా అభివృద్ధి

స్వచ్ఛంగా.. సమృద్ధిగా

- ప్రజల అవసరాలకు సరిపడా నీరు
- వార్డుల్లో రూ. లక్షల వ్యయంతో బోరింగ్‌ల ఏర్పాటు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


యాతపేటలో బోరింగ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి (ఫైల్)


మురళీధరవీధిలో బోరింగ్ వేయిస్తున్న తోట పద్మావతి (ఫైల్)

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం ప్రధాన ధ్యేయంగా పాలన సాగిస్తున్నారు. పేద, మధ్య తరగతి ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక నాయకులకు దిశా నిర్దేశం చేస్తూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. జగనన్న స్ఫూర్తితో నాయకులు కూడా అభివృద్ధి మంత్రం జపిస్తూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. నియోజకవర్గంలోని 34, 35 వార్డుల్లో కార్పొరేటర్లు తోట పద్మావతి, విల్లూరి భాస్కరరావు ప్రజల మంచినీటి అవసరాల కోసం లక్షల వ్యయంతో బోరింగులు ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి నివారణకు కృషి చేశారు. తమ సమస్యల పరిష్కారంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో ఉదారంగా ఉందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


ప్రసాద్ గార్డెన్స్‌లో వేయించిన బోరింగ్

అల్లిపురం : గత ప్రభుత్వ హయాంలో జీవీఎంసీకి ఎన్నికలు జరగకపోవడంతో ప్రత్యేక అధికారి పాలన కొనసాగేది. ఆ సమయంలో వార్డుల్లో అభివృద్ధి కుంటుపడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వార్డుల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ముఖ్యంగా వార్డు ప్రజల మంచినీటి అవసరాలకు అనుగుణంగా జీవీఎంసీ 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి రూ.7 లక్షలతో యాతపేట, రామకృష్ణా జంక్షన్‌లోని ఫిష్ మార్కెట్, మురళీధరవీధిలో మూడు చోట్ల బోరింగ్‌లు వేయటంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

35వ వార్డులో..

వార్డు ప్రజల అభ్యర్థన మేరకు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు వార్డులోని పూర్ణామార్కెట్, గాజుల వీధి, కల్లుపాకలు, వెలంపేట, ప్రసాద్‌గార్డెన్స్, బౌడారా రోడ్డు ప్రాంతాల్లో రూ.10 లక్షల వ్యయంతో కొత్త బోరింగ్‌లు వేయించారు. గత రెండు సంవత్సరాలుగా వార్డు అభివృద్ధికి కార్పొరేటర్ కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం మేరకు అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు విల్లూరి తెలిపారు.

బోరింగ్‌లు ఏర్పాటు చేసిన ప్రాంతాలు.. చేసిన వ్యయం

- 34వ వార్డులో రూ.7 లక్షల వ్యయంతో 3 బోరింగులు ఏర్పాటు
- 35వ వార్డులో రూ.10 లక్షలతో ప్రజల అందుబాటులోకి చేతి పంపులు
- యాతపేట, రామకృష్ణా జంక్షన్‌లోని ఫిష్ మార్కెట్, మురళీధరవీధి, పూర్ణా మార్కెట్, గాజులవీధి, కల్లుపాకలు, వెలంపేట, ప్రసాద్‌గార్డెన్స్, బౌడారా రోడ్డులో ప్రజలకు మంచినీటి వసతి

అడిగిన వెంటనే బోర్ వేయించారు..



మంచినీటి అవసరాలకు బోరింగ్ వేయించమని అడిగిన వెంటనే వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి బోరింగ్ వేయించారు. మాకు మంచినీటి కొరత తీరింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాయకులు ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేయడం ఆనందంగా ఉంది. – **మారిశెట్టి మారతమ్మ, యాతపేట**

నీటి కొరత తీరింది..



మాది రామకృష్ణా జంక్షన్‌లోని ఫిష్ మార్కెట్. ఇక్కడ ఎప్పుడూ నీటి కోసం ఇబ్బంది పడేవారం. ఈ విషయాన్ని కార్పొరేటర్‌కు తెలియజేయటంతో ఆమె సకాలంలో స్పందించారు. బోరింగ్ వేయించి మా సమస్యకు పరిష్కారం చూపించారు. – **చినిపిల్లి యల్లయ్యమ్మ, ఫిష్‌మార్కెట్ వ్యాపారి**

నిత్యం అందుబాటులోనే..



మాది 35వ వార్డులోని గాజుల వీధి. మాకు జీవీఎంసీ కుళాయిలు ఉన్నాయి. అవి రోజులో కొద్ది సేపే రావటంతో వాడకం నీటికి ఇబ్బందులు ఉన్నాయని తెలియజేయగానే మా కార్పొరేటర్ బోరింగ్ వేయించారు. దీంతో మా వీధిలో మహిళల నీటి కష్టాలు తీరాయి. మాకు నిరంతరం అందుబాటులోనే మా కార్పొరేటర్ ఉంటారు. – **బుజ్జి సురేష్, గాజులవీధి**

ఫోన్‌లో చెబితే స్పందిస్తారు..



తాగునీరు ఉన్నా, వాడుక నీటి కోసం పడుతున్న కష్టాన్ని మా కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావుకు చెప్పగానే బోరింగ్ సౌకర్యం కల్పించారు. ఏ సమస్య ఉన్నా ఫోన్‌లో చెబితే స్పందిస్తారు. వార్డులో సౌకర్యాలు మెరుగుపరిచారు. – **కండిపల్లి వరలక్ష్మి, ప్రసాద్ గార్డెన్స్**

ఆదాయ పన్ను నిబంధనలపై అవగాహన


హోటల్ ప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్న ఆదాయ పన్ను శాఖ అధికారులు

సీతమ్మధార : ఆదాయ పన్ను శాఖ అధికారులు హోటల్ ప్రతినిధులకు టీడీఎస్ నిబంధనలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ మేరకు మంగళవారం ద్వారకానగర్ మొదటి లైన్‌లోని విశాఖ హోటల్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో విశాఖ హోటల్స్, రెస్టారెంట్ల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఆదాయ పన్ను అదనపు కమిషనర్ (ఐఆర్ఎస్) టీడీఎస్ నిబంధనలతో పాటు దేశ నిర్మాణంలో టీడీఎస్ ప్రాముఖ్యతను వివరించారు. టీడీఎస్ సర్కిల్–1 ఆదాయ పన్ను డిప్యూటీ కమిషనర్ వై.విష్ణువర్ధన్‌రెడ్డి కమిషన్, మినహాయింపులను వివరించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు టి.సత్యనారాయణ, అధ్యక్షుడు వసంతకృష్ణ, కార్యదర్శి కె.సాంబశివరావు, కోశాధికారి సంజీవరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదాయ పన్ను శాఖ ఇన్‌స్పెక్టర్ పి.ఉమామహేశ్వరరావు, సీనియర్ ట్యాక్స్ అసిస్టెంట్ సి.హెచ్.భావనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు

మద్దిలపాలెం : కార్తీక మాసం అమావాస్యను పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెం శ్రీ గౌరీ జ్ఞాన లింగేశ్వరస్వామి ఆలయంలో గల కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు సూర్య ప్రకాష్‌శర్మ భక్తుల పేరిట అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీలా రమణ, కాండ్రేగుల నూకేశ్వర రావు, బోరా రమణారెడ్డి పాల్గొన్నారు.

శ్రీగౌరీ జ్ఞాన లింగేశ్వర ఆలయంలో దీపాలంకరణ..

కొత్త వెంకోజీపాలెంలో గల జ్ఞానలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం దీపాలంకరణ చేశారు. శివలింగాకృతిలో ప్రమిదలు వెలిగించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీలా రమణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సుపరిపాలన

- 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి
- భూపేష్‌నగర్‌లో వై ఏపీ నీడ్స్ జగన్


పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ పద్మావతి, నీలకంఠం తదితరులు

అల్లిపురం : సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా జగనన్న సుపరిపాలన కొనసాగిస్తున్నారని, రాష్ట్రం అభివృద్ధిపథంలో నడవాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం 34వ వార్డు భూపేష్‌నగర్ సచివాలయం పరిధిలో సచివాలయం ఇన్‌చార్జి, కన్వీనర్లు లింగం శ్రీను, తాతబ్బాయి, ఎల్లయ్యమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో ఆమె మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ముందుగా సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. వై నాట్ 175 నినాదాన్ని నిజం చేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. ప్రతి గడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం వార్డు సచివాలయం పరిధిలో గల పెద్దలు, వృద్ధులు, నాయకులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు దూడ అప్పారావు, భాస్కరరావు, శ్యామ్, గద్దెపల్లి అప్పన్న, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రేణుక యల్లమ్మ దేవాలయంలో మహారుద్రాభిషేకం


అభిషేక మహోత్సవంలో పాల్గొన్న అతిథులు

అల్లిపురం : కార్తీక మాసం ఆఖరి రోజు అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం వద్ద మహారుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యవర్గం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త పీల వెంకట అప్పలనాయుడు, యల్లమ్మ ఆలయం అధ్యక్షుడు కర్రి నీలకంఠం ఆధ్వర్యంలో మృత్తిక లింగ అభిషేకం కనుల పండువగా నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, ఫల రసాలతో శివ నామస్మరణ మధ్య మహాదేవునికి విశిష్ట అభిషేకం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పి.వెంకట రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ద్రోణంరాజు శ్రీవత్సవ్, లింగం శ్రీనివాసరావు, ఆలయ కార్యవర్గ సభ్యులు బొడ్డు పోలారావు, వాసుపల్లి నారాయణ, పంపాన గణేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా తోడపెద్దు సేవ, గరిడీ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమం అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.

ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా


ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద ప్రజాదర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో ప్రజలతో మమేకం అవుతున్నానని అన్నారు. కార్యకర్తల సమస్యలను సొంత సమస్యల్లా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అనారోగ్యంతో ఉన్నవారి ఇంటికి వెళ్లి ఆర్థిక సహాయం చేస్తున్నానని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు, కార్పొరేటర్లు, మండల ప్రెసిడెంట్లు, ఇన్‌చార్జిలు, పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దొండపర్తి పరదేశమ్మ గుడి వద్ద..

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి పరదేశమ్మ గుడి వద్ద ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. 27,41,42 వార్డులకు సంబంధించి ప్రజాదర్బార్‌లో ప్రజలు అందజేసిన వినతులు స్వీకరించి అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు కల్పించాలని యువకులు, పిల్లలకు ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు కల్పించాలని తల్లిదండ్రులు, సాంకేతిక కారణాల వల్ల అమ్మఒడి రానివారు, పాడైన రోడ్లు, ఇతర సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యేకు వినతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల శ్రీనివాస్ రావు, 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, అజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రోగులకు పథకాలు వర్తింపజేయాలి

- సీనియర్ జడ్జి ఎంవీ శేషమ్మ


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ జడ్జి ఎంవీ శేషమ్మ


హాజరైన వివిధ శాఖల అధికారులు

మహారాణిపేట : హెచ్ఐవీ/ఎయిడ్స్ రోగులకు చట్ట పరిధిలోని అన్ని పథకాలు అందజేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ జడ్జి ఎంవీ శేషమ్మ అన్నారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగులకు అందజేసే పథకాలపై అవగాహన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ రోగులకు రేషన్ కార్డులు, పెన్షన్ ఇవ్వాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ ఎయిడ్స్ రోగులకు ప్రభుత్వం ఇచ్చే అన్ని పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. ఎవరికైనా అమలు కాకపోతే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. అలాగే అన్ని యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో కూడా ఏఆర్‌టీ ట్రీట్‌మెంట్, మందులు తప్పకుండా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో సూర్యప్రకాశరావు, చైల్డ్ కేర్ కమిటీ పర్సన్ ఎంఆర్ఎల్ రాధ, ఆర్‌వీఎస్ఎన్ మూర్తి (పోలీసు), శ్రీలత (ఐసీడీఎస్), నోడల్ అధికారి ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, బాబీ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో ముగిసిన జాతీయ సదస్సు


ముగింపు సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

దాబాగార్డెన్స్ : సెయింట్ జోసెఫ్ కళాశాల జువాలజీ విభాగం ఆధ్వర్యంలో జలవనరుల పరిరక్షణ వ్యూహాలు–సుస్థిరతపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. ఫిషరీస్ నుంచి విచ్చేసిన పలువురు శాస్త్రవేత్తలు ప్రసంగాలు చేసినట్టు సదస్సు కన్వీనర్ డాక్టర్ ఇ. హరిణి పేర్కొన్నారు. సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో సీఎంఎఫ్ఆర్ఐ ప్రిన్సిపాల్, సైంటిస్ట్ డాక్టర్ జో కిజాకుడన్ పాల్గొని జలవనరుల పరిరక్షణ అంశం వర్తమానంలో అత్యంత కీలకమని పేర్కొంటూ సదస్సు నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జలవనరుల పరిరక్షణ వ్యూహాలపై విద్యార్థులు ప్రదర్శించిన పోస్టర్లు వినూత్నంగా ఉన్నాయన్నారు. అనంతరం జాతీయ సదస్సులో పాల్గొన్న వారికి జ్ఞాపికలు, ప్రమాణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల జువాలజీ అధ్యాపకులు డాక్టర్ రోజీనా, డాక్టర్ స్నేహ, పలు కళాశాలల ఫ్యాకల్టీ, రీసెర్చి స్కాలర్లు, సైంటిస్టులు, పారిశ్రామికవేత్తలు, డాక్టర్ పి.కె. జయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

‘సాధిక్ బురద జల్లుడు వ్యాఖ్యలు మానుకోవాలి’


సమావేశంలో మాట్లాడుతున్న ముజీబ్‌ఖాన్

దాబాగార్డెన్స్ : పార్టీలో చేరి, ఆశించినది దక్కడం లేదనే అక్కసుతో పార్టీకి రాజీనామా చేయడం వల్ల పాతనగరంలో వైఎస్సార్‌సీపీకి ఎలాంటి నష్టం లేదని నియోజకవర్గ ముస్లిం మైనార్టీ నాయకుడు ముజీబ్‌ఖాన్ 39వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ సాధిక్‌ను ఉద్దేశించి అన్నారు. ఏపీ బీసీ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ సబీరా బేగం, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్, పార్టీ నాయకుడు మహ్మద్ యాసీన్ (బాబ్జి) సంయుక్తంగా మంగళవారం గరుడా జగన్నాయకుల సత్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీవు పార్టీకి రాజీనామా చేస్తూ పార్టీపై బురద జల్లడం, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ వార్డు అభివృద్ధిని అడ్డుకున్నారంటూ చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి హయాంలో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించిన విషయాన్ని నీవు గుర్తించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఒక డిప్యూటీ సీఎం, నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు, 30 మంది డైరెక్టర్లు, తొమ్మిది మంది చైర్మన్లను నియమించి ముస్లింలను గౌరవించడం నీకు కనిపించలేదా? అని ప్రశ్నించారు. సమావేశంలో ఎండీ ఇబ్రహీం, సలీం కమల్, అనీష్, లేకత్, షేక్ అబ్దుల్ పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

సామాజిక స్పృహను తట్టిలేపే ‘బండి’ కవిత్వం


బండి సత్యనారాయణను సన్మానిస్తున్న అతిథులు


పుస్తక ప్రదర్శనలో గ్రంథాలను పరిశీలిస్తున్న నటుడు ఎల్.బి.శ్రీరామ్

మహారాణిపేట : సామాజిక స్పృహను తట్టి లేపే కవితలు రాయడం బండి సత్యనారాయణకే దక్కిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. అరసం విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో రచయిత బండి సత్యనారాయణకు గెద్దాడ బ్రహ్మయ్య మెమోరియల్ ట్రస్ట్ 13వ రాధిక సాహితీ అవార్డును ప్రముఖ రచయిత గెద్దాడ కస్తూరి ప్రసాద్ బహూకరించి సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బండి రచనలు సమాజంలోని ఇతివృత్తాలను ప్రతిబింబిస్తూ పాఠకుల్లో ఆలోచనలు రేకెత్తించే విధంగా ఉంటాయన్నారు. ప్రకృతి ఒడిలో మమేకమై బండి రచనలు చేసేవారని కొనియాడారు. బండి సత్యనారాయణ రచించిన కవితలు చదివి వినిపించారు. కార్యక్రమంలో అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ఉపాధ్యక్షుడు ఎస్. హనుమంతరావు, సీతారత్నం, ఆకాశవాణి డీడీజే (ఇ) సి. సుబ్బారావు, డాక్టర్ మాటూరి శ్రీనివాస్, స్వర్ణ శైలజ, పావని, బుక్ హౌస్ మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకపఠనంతో అభ్యున్నతి

విశాలాంధ్ర పుస్తక మహోత్సవాన్ని మంగళవారం సాయంత్రం ప్రముఖ సినీ నటుడు ఎల్.బి. శ్రీరామ్ సందర్శించారు. ప్రాంగణంలోని పుస్తకాల ప్రదర్శనను తిలకిస్తూ కలియదిరిగారు. లాభాపేక్ష లేకుండా విశాలాంధ్ర సంస్థ సాహిత్య విస్తరణకు కృషి చేస్తూ పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పుస్తక పఠనం పట్ల అందరు మక్కువ చూపాలని శ్రీరామ్ సూచించారు. పుస్తక పఠనం అభ్యున్నతికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, మేనేజర్ రాజు, క్షేత్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

కైలాసగిరీశ్వర ఆలయంలో అన్నసమారాధన


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ దంపతులు

ఆరిలోవ : కార్తీక మాసం ముగియనున్న సందర్భంగా జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల ఆధ్వర్యంలో కైలాస గిరీశ్వరాలయంలో అన్న సంతర్పణ నిర్వహించారు. కార్తీక వన భోజన సమారాధన పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎస్పీ కె.వి. మురళీకృష్ణ దంపతులు ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని శివుడికి పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం జరిగిన వన భోజన సమారాధనలో ఎస్పీ దంపతులు పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, రెవెన్యూ కాలనీ, హనుమంతవాక ప్రజలు, ఏఆర్ పోలీస్ కుటుంబాలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించాయి.

అలరించిన నాటక ప్రదర్శనలు


బాంబే టైలర్స్ నాటకంలో సన్నివేశం

మద్దిలపాలెం: రసజ్ఞ జాతీయ భాషా నాటకోత్సవాలు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గారడీ, బాంబే టైలర్స్ నాటకాలు అలరించాయి. ప్రతి సన్నివేశం ఆసక్తికరంగా సాగి, ఆహూతులను ఆకట్టుకుంది.